క్లుప్తంగా

వేడుకగా మహా రథోత్సవం



అలంకరణలో మంగరాయ అంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయం లో హనుమద్వ్రతం, మహా రథోత్సవం వేడుకలను ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల సూచనల మేరకు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన పూలతో అలంకారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ, ఆలయ ఆవరణలో రథోత్సవం, భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం మహా రథోత్సవం నిర్వహించారు.

వీర బాలురకు నివాళి

ఆదోనిఅర్బన్: వీర బాలురు జోరావర్ సింగ్, ఫతేసింగ్ త్యాగానికి ప్రతీకగా కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 26న 'వీర్ బాల దివాస్' కార్యక్రమం నిర్వహించాలని ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ సూచన మేరకు బీజేవైఎం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వనారాయణ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా సంస్కృత భారతి విభాగ సంయోజక్ శ్రీ అంకి శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాస ఆచారి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ పాల్గొన్నారు. విదేశీ మొఘల్ సామ్రాజ్యాధి నేతలను మత మార్పిడి విషయమై ఎదురించి హిందువులుగా, భారతీయులుగా సజీవ సమాధి అయిన ఇద్దరు పిల్లల త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మణికంఠ, నాయకులు రాహుల్, చవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం: మంత్రాలయం, కోసిగి మండల విద్యాధికారి మొయినుద్దీన్ అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డీఈఓ రంగారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి హాజరైన డీఈఓకు వినతి పత్రం అందించారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ.. ఎంఈఓ విధులకు విరుద్ధంగా నడుచుకుంటూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. టీచర్ల శిక్షణ, సీఆర్పీ కార్యాలయ నిధులు స్వాహా చేశారన్నారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో చేతులు కలిపి ప్రభుత్వ నిబంధనలను తుంగ తొక్కారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనాలు, మన బడి- నాడు నేడు పనుల్లో భాగంగా రంగులు వేయడంలోనూ అవినీతి చేశారని వాపోయారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎంఈఓపై వెంటనే విచారణ జరిపి, విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, అరవింద్, గోవిందు, సుభాన్, రాజేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాపురంలో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బాపురం గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు టీటీడీ ధార్మిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు టీటీడీ కర్నూలు జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథరెడ్డి తెలిపారు. మంగళవారం వారు ధార్మిక కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను గ్రామస్తులు, హిందువులతో కలసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని శివాలయంలో హిందూ ధార్మిక ప్రవచనాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే శుక్రవారం గోపూజ కార్యక్రమం ఉంటుందన్నారు. దేవాలయ పూజారి ఆదయ్య స్వామి, మల్లికార్జున స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్, రౌడూరు గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టనున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం ఉప్పరహాల్ గ్రామంలో, సాయంత్రం రౌడూరు గ్రామంలో యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీల ప్రారంభం

- గ్రామీణ క్రీడాకారులకు చేయూత
- మట్టిలో మాణిక్యాలను వెలికితీద్దాం
- జాతికి అంకితం చేద్దాం
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. క్రీడాకారులు ఆయా పోటీల్లో పాల్గొని మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆదోని మున్సిపల్ క్రీడా మైదానంలో చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన గావించారు. ప్రార్థన అనంతరం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి.

ఆకట్టుకున్న భరత నాట్యం

ఆదోని మున్సిపల్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని మేఘన భరతనాట్య ప్రదర్శణ వక్తలను ఆకట్టుకుంది. స్టేజీపై మేఘన చేసిన భరత నాట్యానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సబ్‌కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ముగ్దులయ్యారు. 100, 200 మీటర్ల పరుగుపందెంలో రాణించిన మాణిక్యంసాగర్, షేక్‌సుభాని, మేఘన, బందెనవాజ్, శ్రావణిలను అభినందించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

ఆడుదాం- ఆంధ్రలో భాగంగా ఆదోని మున్సిపల్ క్రీడా మైదానంలో 47 రోజులపాటు జరిగే ఆటల పోటీల్లో గెలుపు, ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. క్రీడాకారుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్య, క్రీడల్లో పోటీతత్వంతో రాణించాలన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి: సబ్ కలెక్టర్

ఆదోని మున్సిపల్ క్రీడా మైదానంలో 47 రోజులపాటు జరిగే క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. మంగళవారం కబడ్డీ, ఖోఖో పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ ఈఈ వెంకటసుబ్బారెడ్డి, ఎంఈఓ శివరాములు, ఎంఈఓ రాధాక్రిష్ణ, కౌన్సిలర్లు రాజేశ్వరరెడ్డి, సురేష్, రామలింగేశ్వరయాదవ్, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం: ఎమ్మెల్సీ

ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. పట్టణ, పల్లె ప్రాంతాల్లోని ఎంతోమంది ప్రతిభ ఉన్న క్రీడాకారులు ప్రోత్సాహం లేక ఇంటి పట్టునే ఉండిపోతున్నారన్నారు. అలాంటి వారికోసమే ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఆదోని నియోజకవర్గంలో 9,100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. 5,347 మంది విద్యార్థులు, యువత, 3,742 మంది విద్యార్థినులు క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, డీఈఓ రంగారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు

మంత్రాలయం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం పలుచోట్ల 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడ పోటీలను ప్రారంభించారు. రాంపురం ఉన్నత పాఠశాల, మంత్రాలయం ఉన్నత పాఠశాలలో క్రీడోత్సవాలను డీఈఓ రంగారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ క్రీడల ద్వారా మానసికోల్లాసం, దేహదారుఢ్యం వృద్ధి చెందుతుందన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలుంటాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో రూ.30 వేలు, జిల్లా స్థాయిలో రూ.60 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.5 లక్షల నగదు బహుమతులు ఉంటాయన్నారు. ద్వితీయ బహుమతులు నియోజకవర్గ స్థాయిలో రూ.15 వేలు, జిల్లా స్థాయిలో 30 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.3 లక్షలు, తృతీయ బహుమతులు నియోజకవర్గ స్థాయిలో రూ.5 వేలు, జిల్లా స్థాయిలో రూ. 10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ. 2 లక్షల నగదు బహుమతులు అందిస్తామని వివరించారు. అనంతరం కాగడాలను వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శీను, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, ఈవో నాగరాజు, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతలాముని స్వామికి పల్లకీసేవ

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని స్వామి జయంతి వేడుకలు మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామివారి మూల విరాట్‌కు తుంగభద్ర జలాభిషేకం చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. ఆకుపూజ, నైవేద్యం, మహామంగళహారతి, ఊయలసేవ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

ఆదోనిరూరల్: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని యువనేత యువనేత మనోజ్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీలో పదవులు పొందిన వారు మనోజ్ రెడ్డిని కలిసి భారీ గజమాలతో సన్మానించారు. తమ సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో పార్టీ పదవులను కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, కార్యదర్శులు దినేష్ బాబు, తాయప్ప, సహాయ కార్యదర్శులు నరేష్‌కుమార్, గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్



బాధిత కుటుంబసభ్యులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదోనిటౌన్: పట్టణంలో మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మంగళవారం భూమిపూజ చేశారు. టీజీఎల్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న కళాశాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళాశాల భవనం నిర్మాణ పనులను రూ.1.60 కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. మరో రూ.కోటితో సద్భావన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో మంజూరైన షాదిఖానా ఎంతకూ పూర్తి కాలేదని, కొంతమంది ముస్లింలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీడీపీ నాయకులు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముస్లిం మతగురువు ఖాజీఅల్తాఫ్ హుసేన్, మార్కెట్ యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, నాయకులు, కార్యకర్తలు రహిమాన్, అల్తాఫ్, హుసేన్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఆదోనిటౌన్: కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసం వద్ద పలువురు బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన కురువ పెద్దలింగప్ప, పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన ఈరన్న రోడ్డు ప్రమాదంలో, ఎల్‌బీ స్ట్రీట్‌లో నివాసముంటున్న కుండేపల్లి ఈరన్న కరోనాతో మృతి చెందారు. ఆయా కుటుంబాలకు సీఎం సహాయనిధి కింద ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున మంజూరుకాగా ఆ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే పదేళ్ల చిన్నారి సందీప్‌గగన్‌దీప్ వినికిడి లోపంతో బాధపడుతునన్నట్లు పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి చిన్నారి ఆపరేషన్ కోసం రూ.5.30 లక్షలు మంజూరు చేయిస్తూ ఎన్‌ఓసీ కాపీని సత్తెనపల్లి వైద్యశాలకు ఇప్పించాడు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, రామలింగేశ్వరయాదవ్, రహమాన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులు సత్తా చాటాలి



పెద్దకడబూరులో పోటీలను ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి



కోసిగిలో కీడాపోటీల ప్రారంభోత్సవానికి హాజరైన డీఈఓ రంగారెడ్డి

పెద్దకడబూరు: వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహం అందించేందుకే ప్రభుత్వం 'ఆడుదాం–ఆంధ్ర' క్రీడలకు శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లుకుంట, బసలదొడ్డి, దొడ్డిమేకల, చిన్నతుంబళం, మేకడోణ తదితర గ్రామాలతో పాటు పెద్దకడబూరులో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెద్దకడబూరులో సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దారు వీరేంద్రగౌడ్, ఎంఈఓ రామమూర్తి ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎలాంటి గొడవలు లేకుండా కలసిమెలసి ఆటల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. హెచ్ఎం రాజేశ్వరి, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, ఆర్ఐ మహేష్, ఏఎస్ఓ వెంకటేశ్వర్లు, స్కూల్ కమిటీ చైర్మన్ అనిల్, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో రాణించాలి

ఆదోనిరూరల్: యువత క్రీడా స్ఫూర్తితో రాణించాలని జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాద యాదవ్, ఎంపీటీసీ శివకుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని విరుపాపురం గ్రామంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఓడినవారు నిరుత్సాహం చెందకుండా రాబోయే క్రీడల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహ్మద్ ఆలీ, మురళి, ఓంప్రకాష్, వీఆర్వో తిరుమలరెడ్డి, గ్రామ కార్యదర్శి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీల్లో గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటుకోవాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలను డీఈఓ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోని క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో పాల్గొని రాణించాలని సూచించారు. పోటీలను పక్కాగా నిర్వహించాలని పీఈటీలను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బెట్టనగౌడ్, నాయకులు నాడుగేని నాగరాజు, కోసిగయ్య, తహసీల్దారు రుద్రగౌడ, ఎంఈఓలు మోహినుద్దీన్, నాగేశప్ప, పీడీ ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

కౌతాళం: ఆంధ్ర క్రీడాకారులను ఉన్నత స్థాయిలో నిలబెట్టడమే లక్ష్యంగా 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కౌతాళంలో ఎంపీడీఓ సుబ్బరాజు, గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్‌తో కలిసి బెలూన్లు ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఎరిగేరి గ్రామంలో సర్పంచ్ గోవిందు, ఇన్‌చార్జి నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. హాల్విలో సర్పంచ్ క్రాంతి క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. నదిచాగిలో యువకులు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని 7 జెడ్పీ పాఠశాలల్లో క్రీడా పోటీలను ప్రారంభించినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో–ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, ఉప సర్పంచ్ తిక్కయ్య, వడ్డెరాము, ఎంఈఓ శోభరాణి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాదయాదవ్



కౌతాళంలో బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ సిబ్బందికి న్యాయం చేస్తాం



ఆలూరులో మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలూరు: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక మంత్రి నివాసానికి తరలివచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉందన్నారు. తెరవెనుక నుంచి రెచ్చగొచ్చే వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆ యూనియన్ నాయకురాలు ఉన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

ఈనెల 28న హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో కొలువుదీరిన శ్రీ గాదిలింగప్ప తాత ఉత్సవాలకు హాజరుకావాలని కురువ సంఘం నాయకులు రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, మల్లప్ప తదితరులు మంత్రి గుమ్మనూరు జయరాంకు ఆహ్వానపత్రం అందజేశారు.

ధర్మానికి కట్టుబడి ఉండాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ధర్మాన్ని ఆరాధిస్తూ, మంచిని ఆదరించాలని, పరమత సహనం పాటించాలని విజయవాడ కామకోటినగర్ అష్టాక్షరీ పీఠం అధిపతి త్రిదండి రామానుజ జీయర్ స్వామీజీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్ త్రిదండి రాఘవ ప్రపన్న జీయర్ స్వామీజీ సూచించారు. వారు మంగళవారం వెల్దుర్తి మండలం రామళ్లకోటలోని మహిమాన్విత వైష్ణవ క్షేత్రం, సత్యపీఠం కలిగిన భూదేవి, శ్రీదేవి సమేత వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యపీఠంపై కూర్చొని ప్రవచనాలు ప్రబోధించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఆదోని సెంట్రల్: సాటి మనిషి పట్ల ప్రేమ కలిగి జీవించాలని పాస్టర్ తిమోతి సూచించారు. పట్టణంలోని రాయనగర్ కాలనీలో ఉన్న క్రిష్టియన్ ఫెలోషిప్ చర్చిలో మంగళవారం వృద్ధులు, వితంతువులకు దుస్తులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేదరికంలో జీవిస్తున్న 25 మందికి దుస్తులను అందించినట్లు వారు తెలిపారు. అలాగే క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకు



నిరుపయోగంగా మారిన ట్యాంకును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కాలేజీ వెనక రెండు సంవత్సరాల నుంచి నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంకును మంగళవారం సీపీఎం బృందం పరిశీలించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న మాట్లాడుతూ ఎంఐజీ కాలనీ, జ్యోతిర్మయి డిగ్రీ కాలేజీ వెనక నీటి ట్యాంకు కోసం నాలుగేళ్ల క్రితం బోరు వేయడం జరిగిందన్నారు. అలాగే నీటి ట్యాంకు నిర్మించి రెండు సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ మున్సిపల్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకురాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి ట్యాంకును వినియోగంలోకి తేవాలని కోరారు. నాయకులు వెంకటేష్, వీరారెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, రామానాయుడు తదితరులు ఉన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



104బసాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలో మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. సీపీఐ కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు కె.లక్ష్మారెడ్డి, సీఆర్‌నగర్ శాఖలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, మరాఠీగేరి శాఖలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకన్న పార్టీ జెండాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా దున్నేవాడికి భూమి కావాలని, భూపోరాటాలు చేసి వందల ఎకరాలు పేద ప్రజలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకి దక్కిందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సీపీఐ కార్యదర్శి విజయరాజు, కుమారస్వామి, నాగరాజు, చందు, రవి, కొత్తూరు తదితరులు పాల్గొన్నారు.

పేద, బడుగు, బలహీన, కార్మిక, కర్షకుల హక్కుల సాధనకై సీపీఐ పోరాటాలు సాగించి వారికి అండగా నిలిచిందని ఆపార్టీ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. మంగళవారం మండలంలోని 104బసాపురం గ్రామంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ పార్టీ ప్రజలకు చేసిన సేవలను, పోరాటాలను వివరించారు.

పెద్దకడబూరు: బడుగు బలహీన వర్గాల పీడిత ప్రజల కోసం పుట్టిదే సీపీఐ అని ఆ పార్టీ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ అన్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో సీపీఐ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జెండాను అవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతకలహాలు సృష్టించి దేశాన్ని నాశనం చేస్తుందని మండిపడ్డారు. ఇలాంటి మతోన్మాద పార్టీలను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఏఐవైఎఫ్ తాలుకా అధ్యక్షుడు జాఫర్‌పటేల్, నాయకులు దస్తగిరి, చంద్ర, తిక్కన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీమార్లబండ ఆంజనేయ స్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి ఆలయ అర్చకులు గోపాలస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ఫల పుష్పాలు సమర్పించి మహా మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం గ్రామంలోని మేటిగొళ్ల ఇంటినుంచి పూర్ణకుంభం, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయం నుంచి స్వామివారి ప్రతిమను తీసుకొచ్చి రథంపై కొలువుంచారు. అశేష భక్తజనం నడుమ రథోత్సవం చేపట్టి స్వామివారి పాదాల చెంత వరకు లాగా తిరిగి యథాస్థానానికి చేర్చారు. జై శ్రీరాం నామస్మరనతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పూజా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్ నరసమ్మ, అర్లబండ సహకారసంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టనగౌడ్, శ్రీనివాసరాజ్‌దొర, మంగమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.